సాక్షి
జనగామ

మంగళవారం | 2 | ఏప్రిల్ | 2024



కాంగ్రెస్, బీజేపీ.. రెండూ ఒక్కటే!

కాంగ్రెస్, బీజేపీ.. రెండు పార్టీలు ఒక్కటే.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే నాయకులు, కార్యకర్తలను నిలదీయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

- 8లో▸



మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ పిలుపునిచ్చారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $41^{0}/25^{0}$

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ వేడిమితో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ 6:35	బుధ 4:46

న్యూస్‌రీల్

ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన



జనగామ: శ్రీ సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 27 వార్డు శ్రీరామ నవమి పందిరి వద్ద సోమవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు మేళ్లచెరువు అప్పయ్య శాస్త్రి, ప్రసాదశర్మ మంత్రోచ్చరణల నడుమ గణపతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పి.లింగయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి, కమిటీ సభ్యులు పి.వేణు, అయిత శ్రీకాంత్, బచ్చు అశోక్, అరుగుల శ్రీనివాస్, బుస్సా పాండు, కందుకూరి శ్రీనివాస్, గిరి మధు, ప్రభాకర్, చీల కిరణ్, రాములు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

జనగామ రూరల్ : పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడత ఎన్నికల శిక్షణ పూర్తయిందని, నియోజకవర్గం నుంచి 280 మంది పీఓలు, ఏపీఓలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ పాల్గొన్నారు.

నేడు 'రైతు నేస్తం'

జనగామ: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్, జనగామ మండలం గానుగుపహాడ్, కొడకండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికల్లో మంగళవారం (నేడు) 'రైతు నేస్తం' కార్యక్రమం ఉందని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.15 గంటల వరకు వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి(ఐఏఎస్) ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం, 10.25 గంటల వరకు ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్‌పై వీడియో ప్రదర్శన, 10.55 వరకు రాజేంద్రనగర్ సైంటిస్టు డాక్టర్ ఎ.మాధవి ఆధ్వర్యాన ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్‌పై సలహాలు, సూచనలు ఉంటాయన్నారు. 11.10 వరకు ఖమ్మం జిల్లా రఘునాథపాలెంకు చెందిన రైతు వ్యవసాయ క్షేత్రం నుంచి వీసీ ద్వారా ఆయా జిల్లాలోని రైతులు తమ అనుభవాన్ని పంచుకుంటారని పేర్కొన్నారు. 11.15 వరకు కరీంనగర్ జిల్లా రామగుండం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు డి.రాంచంద్రారెడ్డి వ్యవసాయ పొలంలో తీపిదోసకాయ సాగులో ఆయన అనుభవాన్ని రైతులకు వివరిస్తారని చెప్పారు. 11.30 గంటలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ అవసరమైన సూచనలు ఇస్తారని తెలిపారు.

జెడ్పీ సీఈఓకు ఇన్‌చార్జ్ డీపీఓ బాధ్యతలు

జనగామ: జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారిగా జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న డీపీఓ రంగాచారి పదవీ విరమణ పొందడంతో అనిల్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

బిల్లులు విడుదల చేయాలి



జనగామ రూరల్: ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ పెంచడంతో పాటు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని గత ప్రభుత్వం చెప్పగా.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ ప్రస్తావనే తేవడంలేదన్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారికి పరిశ్రమల్లో అప్రంటిస్ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధర్మభిక్షం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


మేమున్నాం..

- అత్యవసర సమయాల్లో '108' సిబ్బంది సేవలు
- పండుగలు, శుభకార్యాలకు దూరంగా ఉంటూ..
- ఏడాదిలో 9,710 కేసుల టేకప్.. 16 కాన్పులు
- మూడు మండలాల్లో అంబులెన్స్‌ల కొరత
- నేడు అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల (108) దినోత్సవం

జనగామ: అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలు సంజీవనిగా పని చేస్తున్నాయి. ఒక్క ఫోన్ కాల్‌తో పది నిమిషాల నుంచి గంట వ్యవధిలో సిబ్బంది వాహనంతో బాధితుల చెంతకు చేరుకుని.. అవసరాన్ని బట్టి ప్రాథమిక చికిత్స అందించడంతోపాటు ఆస్పత్రులకు తీసుకువెళ్తున్నారు. మహిళలకు పురుడు పోస్తూ.. అవసరానికి 'ఊపిరి' అందిస్తూ వేలాది కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 2005 సంవత్సరంలో 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ఒక్కరికీ అత్యవసరంగా వైద్య సేవలు అందించే విధంగా ఈ వాహనాలను తీర్చిదిద్దారు. మంగళవారం 17వ అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవం(108) సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో 17 సంవత్సరాల నుంచి 108 అంబులెన్స్ సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మొత్తం 12 మండలాలు ఉండగా.. 9 మండలాల పరిధిలో 108 సాధారణ అంబులెన్స్‌లు 8, ఒక నియోనాటల్(నవజాత శిశువులకు అత్యవసర సేవలు) వాహనం సేవలందిస్తున్నాయి. షిఫ్టుల వారీగా 24 గంటలపాటు ఒక్కో అంబులెన్స్‌లో నలుగురు సిబ్బంది పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో పాటు కడుపునొప్పి, చెకప్‌కు వెళ్లే గర్భిణులు, అత్యవసర సమయంలో కాన్పులకు వెళ్లే వారు, ఆత్మహత్యాయత్నాలు, అల్లర్లలో గాయపడ్డ క్షతగాత్రులను ఇలా వందలాది మందికి తమ సేవలతో భరోసా కల్పిస్తున్నారు. ప్రతీ నెల 800 కేసుల వరకు టేకప్ చేస్తున్నారు. జనగామ ఎంసీహెచ్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి నెలకు సుమారు 60 నుంచి 100 వరకు వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌కు రెఫెల్ ద్వారా బాధితులను తీసుకువెళ్తున్నారు. శుభకార్యాలు, పండుగల సమయంలో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ 108 ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తున్నారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు అంబులెన్స్‌ల్లో 16 కాన్పులు చేశారు.

జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు 108 అంబులెన్స్‌లు టేకప్ చేసిన కేసుల వివరాలు కేటగిరీల వారీగా..



నియోనాటల్ అంబులెన్స్‌లో నవజాత శిశువుకు అత్యవసర వైద్య సేవలు

సేవ చేసే భాగ్యం రావడం అదృష్టం



108, 102 అంబులెన్స్‌ల ద్వారా సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తీవ్ర గాయాలతో ఉన్న క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకు రావాలంటే చాలా ఏకాగ్రత అవసరం. సంఘటన స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తీసుకువస్తాం.

- మంద శ్రీనివాస్,108, 102 ప్రాజెక్టు మేనేజర్

17 ఏళ్లుగా ఇదే వృత్తిలో..



108 అంబులెన్స్ సేవలో 17 ఏళ్లుగా ఉన్నాను. రోడ్డు ప్రమాదం, ఇతర అనారోగ్య సమస్యలతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చి, ఆరోగ్యంగా ఇంటికి వెళ్లి తమకు కృతజ్ఞతలు తెలిపిన సందర్భంలో ఆ రోజు పడిన కష్టాన్ని మరిచిపోతాం. మా సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డులు కూడా అందిస్తోంది.

- మామిడి రాకేష్, మెడికల్ టెక్నీషియన్

గౌరవంగా భావిస్తున్నా..



108 నియోనటాల్ అంబులెన్స్‌లో పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. రోడ్డు ప్రమదాలు, పాయిజన్, పాముకాటు, గుండె నొప్పి, మెడికల్ కేసుల్లో చాలా మంది క్షతగాత్రుల లైఫ్ సేవ్ చేశాను. వందల సంఖ్యలో గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లాను. 28 మందికి అంబులెన్స్‌లోనే పురుడు పోసినం. అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు అత్యవసర సమయంలో వైద్యసేవలు అందించి అవకాశం నియోనటాల్ అంబులెన్స్‌లో ఉంటుంది.

- శాగ రాంబాబు, ఈఎంటీ, నియోనాటల్ అంబులెన్స్

కొత్త జీవితాలు ప్రసాదించాం



కాన్పులు, రోడ్డు ప్రమాద సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో వారు ప్రాణాపాయ స్థితినుంచి బయటపడ్డారు. వారికి కొత్త జీవితం ఇచ్చామనే సంతోషం మరువలేనిది. 15 ఏళ్లలో ఈఎంటీగా పని చేస్తున్నాను. గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లే సమయంలో 35 డెలివరీలు చేశాం. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. 108 అంబులెన్స్‌లో ఉద్యోగం రావడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను.

- జి.అజయ్‌కుమార్, ఈఎంటీ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- వీసీలో సీఎస్ శాంతికుమారి

జనగామ రూరల్: యాసంగి వరి కోతలు మొదలైన నేపథ్యంలో అవసరం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి.. నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర వచ్చేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లు, తాగునీరు, వడ దెబ్బ, పాఠశాలల్లో మౌలిక వసతులు, అమ్మ కమిటీల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగు నీటి సరఫరా చేపట్టాలని, మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. నీటి సరఫరా పర్యవేక్షణకు మండల స్థాయిలో అధికారులను నియమించాలని, ఎండల తీవ్రత నేపథ్యంలో అత్యవసరమైతే స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రా రైస్ పూర్తి స్థాయిలో డెలివరీ చేయాలని, ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లాలో అమ్మ కమిటీల ఏర్పాటు పూర్తిచేసి మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్‌కుమార్, డీసీఎస్‌ఓ రోజారాణి, డీఆర్‌డీఓ మొగిలప్ప, డీఈఓ రాము, డీఏఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుని టోకెన్ పద్ధతి అమలు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని తేమ 17 శాతానికి మించకుండా చూసి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ఎ–గ్రేడ్ రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 ధర వచ్చేలా కృషి చేయాలన్నారు. వేయింగ్ మిషన్, క్లీనర్లు, బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డీసీఎస్‌ఓ, డీఎం ప్రసాద్, డీఏఓ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూం పరిశీలన

కలెక్టరేట్‌లోని సమీకృత కంట్రోల్ రూంను కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. సి–విజిల్‌లోని ఫిర్యాదుల వివరాలను సంబంధిత టీంను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈడీఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్.. పరామర్శలు చేయడం సిగ్గుచేటు

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: వరి పంట సాగు చేస్తే ఉరి పేరిట చట్టాలు తెచ్చిన కేసీఆర్.. ఎండిన పంటల పేరిట పరామర్శలు చేయడం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14 నెలలపాటు దేశ రాజధానిలో రైతులు పోరాటం చేస్తే.. అసెంబ్లీలో తీర్మానం చేయకుండా మద్దతు పలకని కేసీఆర్‌కు అధికారం పోగానే అన్నదాతలు గుర్తుకు వచ్చారా అని ఎద్దేవా చేశారు. నల్ల చట్టాలతో రైతన్న వెన్ను విరిచి కార్పొరేట్ చేతుల్లో పెట్టాలని ప్రయత్నించిన కేంద్రంలోని బీజేపీ సర్కారును ఆయన ఎప్పుడూ తప్పుపట్టలేదన్నారు. తొమ్మిదన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వేలాది మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడితే ఒక్క రైతు కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తుంటే ఓర్వలేని కేసీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అధికార అహంకారంతో ఎర్రవెల్లి ఫాంహౌస్‌కే పరిమితమై కనీసం మంత్రులను సైతం కలవకుండా నియంతగా వ్యవహరించిన కేసీఆర్‌కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా బుద్ధి రావడం లేదన్నారు. పగటి వేషాలు మాని ఫాంహౌస్‌లోనే పడుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న కొమ్మూరి

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

రామన్నపేట : ఎన్నికల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. వరంగల్‌లోని ఎల్బీ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, భూపాలపల్లి అసెంబ్లీ స్థానాల్లో మంగళవారం నుంచి 6వ తేదీ వరకు నిర్దేశిత కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరంగల్ తూర్పులో 894 మంది సిబ్బందిని కేటాయించి ఎల్బీ కళాశాలలో మూడు రోజులపాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నూతన నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణకు గైర్హాజరైన వారు మరుసటి రోజు తప్పకుండా హాజరు కావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెండో సెషన్‌లో వీవీ ప్యాట్‌లపై సిబ్బందికి ప్రయోగాత్మకంగా ఇస్తున్న శిక్షణ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం అందించిన ఫారం–12, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఏమైనా తప్పులు ఉంటే సరిచేసి తిరిగి ఉద్యోగికి ఫారం–12 ప్రింట్ ప్రతి అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, 'కుడా' పీఓ అజిత్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ కృష్ణ, డి.శ్రావణ్‌కుమార్, కనుకయ్య, వాసు, నాగార్జున పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో సూచనలిస్తున్న ప్రావీణ్య

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జనగామ స్పెషల్ డిప్యూటీ(భూసేకరణ) కలెక్టర్ వి.సుహాసిని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో సోమవారం నిర్వహించారు. ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న పర్యవేక్షణలో ఆరుగురు శిక్షణ నిపుణులచే రెండురోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఓలు, ఏపీఓలు ఎన్నికల విధులను బాధ్యతగా, సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల విధులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు అమర్చే విధానం, 12డీ బ్యాలెట్ ఓటును వినియోగించే పద్ధతి తదితర ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికలు సజావుగా, విజయవంతంగా జరిగేలా అందరూ సమర్థవంతంగా పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఆ.. ఆరోపణలు అవాస్తవం : కలెక్టర్

జనగామ రూరల్: సీపీఎం నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవం.. ఇలాంటివి మరోసారి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించొద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రకాల అనుమతులపై సువిధ పోర్టల్ పనిచేయడం లేదని సీపీఎం నాయకులు ఆదివారం సీసీకి తెలుపగా.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.. అందులో అధికారి ఉంటారు.. సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. ఇందుకు అంగీకరించకుండా దురుసుగా ప్రవర్తించి కలెక్టర్‌ను కలవాలంటూ అమర్యాదగా మాట్లాడడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శిని పిలిచి ఎన్నికల నిబంధనలకు సంబంధించి వివరించామన్నారు. సమస్యల పరిష్కారానికి ఈడీఎంను కలవాలని చెప్పగా.. పార్టీ ప్రతినిధి అగౌరవంగా మాట్లాడారని, ఆ సమయంలో చాంబర్‌లో ఇతర దరఖాస్తుదారులు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా అరిచారని వివరించారు. ఎన్నికల అధికారి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బ్లాక్ మెయిల్ చేసే విధంగా మాట్లాడుతూ దురుసుగా ప్రవర్తించారని ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు!

- హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్‌ల సమావేశం
- ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంట్లో సుదీర్ఘ భేటీ
- తెరపైకి కొత్తగా ఎర్రోళ్ల శ్రీనివాస్
- రేసులో పెద్ది స్వప్న, డాక్టర్ సుధీర్.. ఏకాభిప్రాయం వస్తే ఓకేనన్న 'పెద్ది'
- ప్రకాశ్‌రెడ్డిపేట సభ సందర్భంగా సస్పెండైన నేత పేరు చర్చకు
- అభ్యర్థి ప్రకటనకు మరో రెండు రోజులు..



సాక్షిప్రతినిధి, వరంగల్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు పడుతోంది. ఎన్నికల ప్రస్తావన నాటి నుంచి ఆపార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు గందరగోళం సృష్టిస్తున్నాయి. వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌ను కాదని మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు అవకాశం కల్పించారు. ఈనిర్ణయంపై అసంతృప్తికి గురైన ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీని వీడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య 'యూ'టర్న్ తీసుకుని తండ్రి శ్రీహరితో కలిసి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరడం బీఆర్‌ఎస్‌కు పెద్దషాక్‌గా మారింది. ప్రత్యామ్నాయంతో పాటు పార్టీ లీడర్లు, క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆదివారం చింతగట్టు సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ పార్లమెంట్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై అభిప్రాయ సేకరణ చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంట్లో సుదీర్ఘ భేటీ నిర్వహించారు.

రేసులో అరడజను మంది..

టీఆర్‌ఎస్ ఆవిర్భావం సమయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న ఉస్మానియా జేఏసీ ఉద్యమనేత ఎర్రోళ్ల శ్రీనివాస్ పేరు తాజాగా తెరపైకి వచ్చినట్లు తెలిసింది. తన నాయకత్వంలో పని చేసిన బాల్క సుమన్, గ్యాదరి కిషోర్‌వంటి చాలా మందికి శాసన సభ్యులుగా అవకాశం దక్కింది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసినప్పటికీ చట్టసభల్లోకి వెళ్లే పదవులు రాలేదన్న భావనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు చెబుతున్నారు. వరంగల్ సీటును మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని భావిస్తున్న బీఆర్‌ఎస్.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్‌గా పని చేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్నప్పటికీ.. వరంగల్ పార్లమెంట్‌కు ఆయన స్థానికేతరుడన్న చర్చ కూడా జరుగుతోంది. కాగా.. వరంగల్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న, హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్లు కూడా ప్రధానంగా వినిపిస్తున్నాయి. పెద్ది స్వప్న మాల సామాజికవర్గానికి చెందిన నాయకురాలు కాగా.. వరంగల్ పార్లమెంట్ పరిధి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు ఏకాభిప్రాయానికి వచ్చి అవకాశం ఇస్తేనే పోటీలో ఉంటామని పెద్ది సుదర్శన్ రెడ్డి.. ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంట్లో జరిగిన భేటీలో కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. ఇక డాక్టర్ సుధీర్‌కుమార్ మాదిగ సామాజికవర్గానికి చెందిన నేత అయినప్పటికీ స్థానికేతరుడనే ప్రచారం ఉంది. తాను పార్టీ ఆవిర్భావం నుంచి కరీంనగర్ జిల్లా ఉద్యమాల్లో కీలకంగా ఉన్నానని, హనుమకొండలోనే జన్మించి ఇక్కడే విద్యను అభ్యసించడం వల్ల స్థానికేతరుడనే ప్రచారం సరికాదని సుధీర్‌కుమార్ అంటున్నారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారుడు, అధ్యాపకుడు డాక్టర్ బైరి నిరంజన్ తదితరులు మొదటి నుంచి వరంగల్ టికెట్ ఆశిస్తున్నారు. మాల సామాజిక వర్గానికి ఇవ్వాలని భావిస్తే పేరును కూడా పరిశీలించాలని ఆదివారం హరీశ్‌రావును కలిశారు. డాక్టర్ సుజాత, టీఆర్‌ఎస్‌వీ నాయకుడు కందుకూరి ప్రభాకర్‌తో పాటు మరో నలుగురు టికెట్ అడుగుతున్నట్లు సమాచారం.

వలస నేతలకు వత్తాసు!

వరంగల్ పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంట్లో జరిగిన పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశంలో పాలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. పెద్ది స్వప్న, డాక్టర్ సుధీర్, పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్.. బీఆర్‌ఎస్ వైపు చూస్తున్న మరికొందరు కాంగ్రెస్ నేతల పేర్లు కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. పార్టీలో ప్రస్తుతం కీలకంగా పని చేస్తున్న వారిని కాదని అవకాశవాద రాజకీయాల కోసం పార్టీని వీడిన, పార్టీలో చేరాలనుకున్న వారి పేర్లను కొందరు ప్రస్తావనకు తేవడంపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఉద్యమ సమయం నుంచి పార్టీలో పని చేస్తున్న వారిని కాదని వలస నేతల కోసం ఎదురుచూసి వారికి అవకాశం కల్పిస్తే.. ఇదివరకు ఏర్పడిన పరిస్థితే పార్టీకి మళ్లీ వస్తుందని కొందరు తెగేసి చెప్పినట్లు సమాచారం. ప్రకాశ్‌రెడ్డిపేటలో సుమారు 14 ఏళ్ల కిందట నిర్వహించిన ప్రజాగర్జన సందర్భంగా వివాదాస్పదమై పార్టీ నుంచి సస్పెండై.. నిన్నటి వరకు కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించిన ఓ నేత పేరును అభ్యర్థిగా ప్రతిపాదించడంపై భేటీలో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలిసింది. సుమారు రెండుగంటల పాటు వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై హరీశ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన భేటీలో అన్ని కోణాల్లో చర్చించినట్లు తెలిసింది. సమావేశంలో చర్చించిన అంశాలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తుదినిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా.. అభ్యర్థి ఎంపిక, అధికారిక ప్రకటనకు మరో రెండు, మూడ్రోజులు పట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.

4 నుంచి బీఫార్మసీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీఫార్మసీ (సీబీసీఎస్) మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. 4న పేపర్–1 ఫార్మాస్యూటికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, 6న పేపర్–2 ఫిజికల్ ఫార్మాస్యూటిక్స్–1, 8న పేపర్–3 ఫార్మాస్యూటికల్ మైక్రోబయాలజీ, 10న పేపర్–4 ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు.

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కావ్య

- ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం



సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కడియం కావ్య పేరు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కడియం కావ్య నాలుగు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఆ పార్టీ అభ్యర్థిగా తాను పోటీ నుంచి తప్పుకుంటున్నానని అంతకుముందు రోజు కావ్య పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖలో స్పష్టం చేశారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నేతల సమక్షంలో కావ్య, ఆమె తండ్రి కడియం శ్రీహరి హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశం అనంతరం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలకు కడియం శ్రీహరి, కావ్య కృతజ్ఞతలు తెలిపారు.

కాజీపేట నుంచి రెండు క్రూ రైళ్ల తరలింపు

- ఎక్కడికి తరలించొద్దంటున్న రైల్వేనాయకులు, లోకోపైలెట్లు
- ట్రేడ్‌యూనియన్లు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలి



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయం కేంద్రంగా పనిచేస్తున్న క్రూ లింక్ రైళ్లలో సోమవారం రెండు క్రూ లింక్ రైళ్లను సికింద్రాబాద్‌కు తరలించి ఆపరేటింగ్ చేసినట్లు రైల్వే నాయకులు, లోకోపైలెట్లు తెలిపారు. కాజీపేట నుంచి 3 క్రూ లింక్‌లు 6 రైళ్లను సికింద్రాబాద్‌కు తరలించి ఏప్రిల్ 1 నుంచి నడిపిస్తున్నట్లు సికింద్రాబాద్ అధికారులు కాజీపేట అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వాటిలో సోమవారం సికింద్రాబాద్–కాగజ్‌నగర్, కాగజన్‌నగర్–సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ క్రూ లింక్‌లను సికింద్రాబాద్ నుంచి ఆపరేటింగ్ చేసినట్లు తెలిపారు. కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు తరలిపోయిన 2 క్రూ లింక్‌ల స్థానంలో కాజీపేటకు సికింద్రాబాద్ నుంచి 1 క్రూ లింక్ ఇచ్చారని తెలిపారు. ఆదిలాబాద్–తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు కాజీపేట నుంచి కాజీపేట–విజయవాడ, విజయవాడ–కాజీపేట మధ్య కాజీపేట క్రూ వారు ఆపరేటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు ఎందుకు క్రూ లింక్‌లను తరలించాలి, సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు క్రూ లింక్ ఎందుకు తిరిగి ఇవ్వాలో రైల్వే లోకోపైలెట్లకు అంతు చిక్కని విషయంగా మారింది. ఎవరి లింక్‌లు వారికి ఉంటే సమస్య ఉండేది కాదని కాజీపేట రైల్వే డిపో కేంద్రంగా నిపుణులైన లోకోపైలెట్లు ఉన్నప్పటికీ ఇలా క్రూ లింక్‌లను అటు ఇటు ఎందుకు తరలిస్తున్నారో ఎవరికి అర్థం కావడం లేదంటున్నారు. కాజీపేట నుంచి క్రూ లింక్‌లు తరలించకుండా రైల్వేలో ప్రధాన ట్రేడ్ యూనియన్లు అయిన రైల్వేమజ్దూర్ యూనియన్ నాయకులు, ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు పట్టించుకొని రైల్వే జీఎం, డీఆర్‌ఎంలతో మాట్లాడి క్రూ లింక్‌ల గొడవను పరిష్కరించి రైల్వే లోకోపైలెట్ల కుటుంబాల పక్షాన నిలిచి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

యువకుడిపై దాడి కేసులో నిందితుల అరెస్ట్

కొత్తగూడ: దళిత యువకుడిపై దాడి చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దిలీప్ సోమవారం తెలిపారు. చోరీ చేశాడనే నెపంతో వంకాలయ కార్తీక్‌ను చిత్రహింసలకు గురి చేసినట్లు సాక్ష్యాధారాల మేరకు గద్ద అశోక్, ఏటుకూరి హరీష్, చెవ్వ శివ, వట్టం నాగరాజు, గుగ్గిళ్ల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చోరీలు జరిగినట్లు తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగలపై దాడికి పాల్పడొద్దన్నారు.

మేధస్సుకు 'ప్రేరణ'..

9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోటీలు

- నేటి నుంచి పాఠశాల స్థాయిలో..



విద్యారణ్యపురి/జనగామ: విద్యార్థుల్లోని మేధస్సుకు పదును పెట్టి.. వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రేరణ' అనే పేరుతో ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ హైస్కూళ్లలోని 9, 10 తరగతులు, కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈ ప్రేరణ ద్వారా వివిధ పోటీలు నిర్వహించబోతున్నారు.

9నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల ఎంపిక

2024 –2025 విద్యాసంవత్సరానికి సంబంధించి 9నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఈ పోటీలకు ఎంపిక చేయాల్సింటుంది. 'వికసిత్ భారత్, సమాజ, దేశాభివృద్ధిలో నా పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పాటలు, డ్రాయింగ్‌పోటీలు నిర్వహించాల్సింటుంది. అందులో ఒక బాలుడు, ఒక బాలికను ఎంపిక చేయాల్సింటుంది. హనుమకొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, హైస్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌ల్లో విద్యార్థులకు నేడు (మంగళవారం) ప్రేరణ పోటీలు నిర్వహించాలని డీఈవో అబ్దుల్‌హై.. ప్రాధానోపాధ్యాయులను ఆదేశించారు.

20న జిల్లా స్థాయి పోటీలు..

హనుమకొండ జిల్లాస్థాయి పోటీలు ఈనెల 20న కేంద్రీయ విద్యాలయంలో నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో ప్రతిభను చూపిన ఆయా విద్యార్థులు ఇందులో పాల్గొంటారు. ఈజిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన 15మంది బాలురు, 15మంది బాలికలను ఎంపిక చేయాల్సింటుంది. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన ఆయా 30మంది విద్యార్థుల్లో మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి చివరగా ఒక బాలుడిని, ఒక బాలికను ఎంపి చేయాల్సింటుంది. ఎంపికైన ఇద్దరు విద్యార్థులను గుజరాత్‌కు పంపిస్తారు. అక్కడి వాద్రాఘర్ పాఠశాలలో రాష్ట్రం నుంచి వెళ్లిన ఆయా విద్యార్థులకు ఐదురోజులు శిక్షణ ఇస్తారు.

విద్యార్థులకు ఉపయుక్తం



'ప్రేరణ' కార్యక్రమంలో జిల్లాలో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి. వేసవి సెలవుల్లో విద్యార్థులకు మేధోవికాసం పెంపొందించడానికి నిర్వహించే ఈ శిక్షణతో ఎంతో ఉపయుక్తం ఉంటుంది. జిల్లాలో ఈనెల 2న ఈ పోటీలు నిర్వహించనున్నాం.

– ఎండి అబ్దుల్‌హై, డీఈఓ, హనుమకొండ

మూడు జిల్లాలకు నోడల్ సెంటర్ జేఎన్‌వీ

- ప్రేరణ పోటీలకు జిల్లాస్థాయికి సంబంధించి నోడల్ సెంటర్‌గా మూడు జిల్లాలకు వరంగల్‌లోని జవహర్ నవోదయ పాఠశాల ఉంది. జిల్లాస్థాయి పోటీలు ఈనెల 20న వరంగల్, ములుగు, జనగామ జిల్లాల్లో జరగనున్నాయి.
- హనుమకొండలోని కేంద్రీయ విద్యాలయం మూడు జిల్లాలకు నోడల్‌సెంటర్‌గా ఉంది. ఇందులో హనుమకొండ, మహబూబాబాద్ ,జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలున్నాయి.
- హనుమకొండ జిల్లా మాత్రం ఈనెల 2న పాఠశాల స్థాయి పోటీలు నిర్వహిస్తుంది. మిగతా జిల్లాలు వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో వారి వీలునుబట్టి పాఠశాల స్థాయి పోటీలను ఈనెల 10వ తేదీలోపు నిర్వహించనున్నారని సమాచారం.
- హనుమకొండ జిల్లాలో 402 పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి వరకు 20వేలమందికి పైగా విద్యార్థులున్నారు.
- వరంగల్‌జిల్లాలో 408 పాఠశాలల్లో 9నుంచి 12వ తరగతి వరకు 32,987మంది విద్యార్థులు ఉన్నారు.
- జనగామ జిల్లాలో 246 పాఠశాలలు, జూనియర్ కాలేజీలు కలిపి 9నుంచి 12 తరగతుల వరకు 45వేల మంది విద్యార్థులున్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్



హనుమకొండ: మాట్లాడుతున్న అరూరి రమేశ్

హన్మకొండ/కాశిబుగ్గ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్, వరంగల్ ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీ వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అరూరి రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, నరేంద్ర మోదీ మూడోసారి దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటలో చేపట్టిన అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందన్నారు. వరంగల్ పార్లమెంట్ ప్రజలు ఈ సారి బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కడియం దళితద్రోహి అని, ఆయన టీడీపీ, బీఆర్‌ఎస్‌లో ఉండి ఎస్సీ రిజర్వేషన్ ఉపయోగించుకుని అసలైన దళితులకు అవకాశాలు రాకుండా అణగదొక్కాడన్నారు. అందుకే వరంగల్ జిల్లా ప్రజలు కడియ శ్రీహరికి బుద్ధి చెప్పాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో తాను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే ఎక్కడ మంత్రి పదవి వస్తుందోనని భయపడి తన ఓటమికి కుట్ర చేశాడని ఆరోపించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ వరంగల్ బీజేపీకి కంచుకోట అని, ఈ పార్లమెంట్ స్థానంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, దొంతి దేవేందర్ రెడ్డి, టి.కుమారస్వామి, కందగట్ల సత్యనారాయణ, బైరి లక్ష్మి, రావుల కోమల, చాడ స్వాతి, గుజ్జుల వసంత, కుసుమ సతీష్, భాకం హరిశంకర్, సముద్రాల పరమేశ్వర్, కనుకుంట్ల రంజిత్, సిద్దం నరేష్, సమ్మిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఘర్షణ..

- భార్యాభర్తలు, కొడుకుపై హత్యాయత్నం
- గొడ్డలి, కర్రలతో దాడి.. తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన కృష్ణ

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో భూ వివాదంలో ఏర్పడిన ఘర్షణ హత్యాయత్నానికి దారితీసింది. గ్రామంలో రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. రేపాల కృష్ణ, భిక్షమమ్మ, అశోక్‌పై అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న, పెద్దసత్యం, ఉపేందర్, చాత్రాసిపల్లి నీలగిరితోపాటు కుటుంబసభ్యులు సోమవారం గొడ్డలి, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల కథనం ప్రకారం.. కాంపల్లి గ్రామంలోని జాతీయ రహదారి పక్కన రేపాల కృష్ణకు చెందిన వ్యవసాయ భూమికి ఎదురుగా రాళ్లు పాతేందుకు అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న, ఉపేందర్, పెద్దసత్యం యత్నించారు. దీంతో రాళ్లు ఎందుకు పాతుతున్నారని అశోక్ అడగడంతో ఘర్షణ మొదలైంది. నీ భూమి కాదు.. మా భూమిలో రాళ్లు పాతుకుంటాం.. ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించి తమ వద్ద ఉన్న గొడ్డలి, కర్రలు, గడ్డపారతో అశోక్‌పై దాడి చేశారు. అడ్డు వచ్చిన తల్లి భిక్షమమ్మపై కూడా దాడి చేసి గాయపరిచారు. తన కొడుకు అశోక్, భార్య భిక్షమమ్మపై జరుగుతున్న దాడిని గమనించి రేపాల కృష్ణ.. ఘటనా స్థలికి చేరుకోవడంతో అతడిపై కూడా గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతులు 108కు సమాచారం అందజేసి క్షతగాత్రులను మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఇందులో కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. కాగా, ఈ విషయమై సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

గంజాయి పట్టివేత కేసులో ముగ్గురికి జైలు

మహబూబాబాద్ రూరల్: గంజాయి పట్టివేత కేసులో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2020 ఏప్రిల్ 10వ తేదీన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గురప్పతండాకు చెందిన బానోత్ జగన్ ఇంటి వద్ద 14 కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీనిపై అప్పటి మరిపెడ సీఐ ఎన్.సాగర్, ఎస్సై సిరిసిల్ల అశోక్.. బానోత్ జగన్, బానోత్ వీరన్న, బానోత్ రమాదేవిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్సై సిరిసిల్ల అశోక్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై బాణాల వెంకటాచారి, ప్రస్తుత మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తాహేర్ బాబా ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి, పీసీ రావిశెట్టి యాకేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి.. నేరం నిరూపణకాబడిన ముగ్గురికి ఒక్కొక్కరికి ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కాగా, నేరస్తులకు శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, తొర్రూరు డీఎస్పీ సురేష్ అభినందించారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

- సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వి ధులు నిర్వర్తించి ఎన్నికలను విజయవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో అధికారుల పనితీరుపై సీపీ నెలవారి నేర సమీక్ష, ఎన్నిక నిర్వహణపై పోలీస్ కమిషనరేట్‌లోని సెంట్రల్, ఈస్ట్‌జోన్‌కు చెందిన పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సీపీ స్టేషన్లవారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అధి కారులను అడిగి తెలుసున్నారు. పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్ కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా నేరా నికి పాల్పడిన నేరస్తుడికి శిక్షపడే విధంగా నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేయాలని, గంజాయి, అత్యాచారానికి సంబంధించిన కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్లు, పెండింగ్‌లోని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చాలన్నారు. కమిషనరేట్ పరిధి లోని మద్యం షాపులు రాత్రి వేళల్లో నిర్ణీత సమయంలోగా మూసివేసేలా స్థానిక స్టేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపై డీసీపీ, ఏసీపీ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తప్పక సందర్శించాలని, మౌలిక వసతుల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే సంబంధిత అధికారుల సమాచారం అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారి, ట్రెయినీ ఐపీఎస్ అధికారులు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచాలి

ఖిలా వరంగల్: శిక్షణ కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేసి పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీరాగ్యానాయక్ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయాన్ని 306 మంది ఆర్మీ రిజర్వ్ మహిళా శిక్షణార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్‌కిశోర్‌ఝూ శిక్షణార్థులను పరిచయం చేసుకున్నారు. సీపీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది పనితీరును శిక్షణార్థులు పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ మహిళలు ఆర్మీ ఫోర్సెస్ బాధ్యత చాలా ప్రధానమన్నారు. మీ విధి నిర్వహణ వీవీఐపీ సెక్యూరిటీ విషయం, సమాజసేవలో పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని, పోలీస్ ప్రతిష్ట పెంపొందించే విధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ భిక్షపతి, సీడీఐ చంద్రశేఖర్, ఆర్‌ఎస్సై రాజేష్, అనిల్, ఇన్‌స్పెక్టర్ వడ్డె నరేష్, అశోక్, భారీ, సంజీవ, సిబ్బంది పాల్గొన్నారు.

- 1929లో పట్టాలెక్కిన రైలు

కాజీపేట రూరల్ : వరంగల్ మీదుగా చెన్నై–న్యూఢిల్లీ మధ్య రాకపోకలు సాగించే గ్రాండ్‌ట్రంక్ (జీటీ) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారంతో 95 వసంతంలోకి అడుగుపెట్టిందని రైల్వే అధికారులు తెలిపారు. వరంగల్, కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ మీదుగా ఈ రైలు చెన్నై– న్యూఢిల్లీ మధ్య ప్రయాణిస్తుంది. అధిక స్పీడ్ కలిగిన మొదటి ట్రైన్‌గా జీటీకి పేరుంది. దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశం మధ్య ప్రవేశపెట్టిన మొదటి ట్రైన్ జీటీ ఎక్స్‌ప్రెస్. 1929 ముందే చంద్రాపూర్–నాగాపూర్, కాజీపేట–విజయవాడ మధ్య రైల్వే మార్గం అందుబాటులో ఉంది. ఎప్పుడైతే ఆంగ్లేయులు దేశరాజధానిని కోల్‌కత్తా నుంచి ఢిల్లీకి మార్చారో అప్పుడు వారి దృష్టి ఢిల్లీని దక్షిణ ప్రాంతంతో అనుసంధానం చేయడం మీద వారి పడింది. సరుకు రవాణ వేగవంతం చేయడం కోసం ఢిల్లీని పోర్టు ప్రాంతమైన మద్రాస్(చెన్నై)తో అనుసంధనం చేయడానికి రైలు మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో నడిచిన మొదటి రైలు జీటీ ఎక్స్‌ప్రెస్.

జీటీ ఎక్స్‌ప్రెస్‌కు 95 వసంతాలు..



రైలుకు స్వాగతం

వరంగల్, కాజీపేట టౌన్ స్టేషన్‌లో సోమవారం ఉదయం చెన్నై–న్యూఢిల్లీ మధ్య రాకపోకలు సాగించే జీటీ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలికినట్లు అధికారులు తెలిపారు. లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, ట్రైన్ మేనేజర్‌లకు చాక్లెట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ.. రెండూ ఒక్కటే !



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఓట్లడిగేందుకు వస్తే నిలదీయండి..

- కాంగ్రెస్‌వి అన్నీ ఉద్దెర మాటలే
- కక్షసాధింపు రాజకీయాలతోనే బీజేపీ మనుగడ
- మోసకారి కడియం పార్టీ వీడడంతో బీఆర్‌ఎస్‌లో జోష్
- రేవంత్‌వి తుపాకీ రాముడి చేష్టలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు

హసన్‌పర్తి: కాంగ్రెస్, బీజేపీ.. రెండూ పార్టీలు ఒక్కటేనని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు నిలదీయాలని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం చింతగట్టు క్యాంప్ సమీపంలోని కేఎల్‌ఎన్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకివచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి వంద రోజులైనా రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అడ్రస్ లేదన్నారు. పెన్షన్‌లు ఎప్పుడూ పెంచుతారని వృద్ధులు, వితంతు, బీడీ కార్మికులు, దివ్యాంగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతులు, ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం ఆ కుటుంబాలను పరామర్శించే దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి తుపాకీ రాముడి చేష్టలుగా అభివర్ణించారు. రాహుల్.. మోడీ, అదానీని విమర్శిస్తుంటే... రేవంత్ మాత్రం వారిని పొగడ్తలతో ముంచుతున్నాడని చెప్పారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. అవసరమైతే మానవ బాంబునవుతానంటూ చెప్పడం కాదు..మానవీయ పాలన చేయాలని రేవంత్‌కు హితవు పలికారు. కడియం శ్రీహరి పార్టీ మారడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు జోష్‌లో ఉన్నాయని చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించడానికి ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. ఎంపీ, ఉప ముఖ్యమంత్రి, రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినప్పటికీ విధేయత చూపాల్సి ఉండగా కడియం పార్టీ ద్రోహం చేశాడని పేర్కొన్నారు. కూతురుకు టికెట్ ఇచ్చినా పార్టీ మారడాన్ని తప్పుబట్టారు.లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను చిత్తుగా ఓడించి, శ్రీహరికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ టీడీపీలో కడియం శ్రీహరికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వకుంటే ఎన్టీఆర్ వద్దకు వెళ్లి టికెట్ ఇప్పించానన్నారు. పోయినవారిని పోనివ్వండి..మనం కష్టపడి పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కడియం కుట్ర వల్ల ఎంపీ దయాకర్, అరూరి రమేష్‌తో పాటు రాజయ్య పార్టీవీడారన్నారు. రాజయ్యపై ఆరోపణలు చేసి గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకుండా కుట్ర పన్నాడని పేర్కొన్నారు. కడియం భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. భూములతో పాటు విలువైన ప్లాట్లు, కాంట్రాక్టర్ల నుంచి భారీగా కమీషన్ వసూలు చేశాడని ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు వస్తే కడియం శ్రీహరిపై తిరుగుబాటు తప్పదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కడియం శ్రీహరి వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలువాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కడియం శ్రీహరి బ్రోకర్ అని మండిపడ్డారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ మోసం చేయడంలో కడియం దిట్ట అని పేర్కొన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడును వెన్నుపోటు పొడిచిన కడియం.. ప్రస్తుతం కేసీఆర్‌ను మోసం చేశాడన్నారు. అధికారం కోసం ఎంతటికైనా తెగిస్తాడన్నారు. కేఏల్ పాల్ పార్టీ అధికారంలోకి వస్తే పదవి కోసం అందులో చేరడానికి వెనుకంజ వేయడన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, జెడ్పీచైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, 'కుడా' మాజీ చైర్మన్‌లు సుందర్‌రాజ్, యాదవరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్‌లు కిరణ్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన గడ్డ నుంచే ఎంపీగా పోటీ..



మాట్లాడుతున్న మాజీ మంత్రి బాబుమోహన్

- ప్రజాశాంతి పార్టీ నుంచి బరిలోకి..
- మాజీ మంత్రి బాబుమోహన్

రామన్నపేట: 'నేను పుట్టింది వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట. పరకాలలో చదువుకున్నా. మా నాన్న ఇక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేశారు.. నాకు ఈ ప్రాంతంలో చాలా మంది తెలుసు.. నేను ప్రజాశాంతి పార్టీ నుంచి వరంగల్ ఎంపీగా ఎన్నికల బరిలో దిగుతున్నా' అని మాజీ మంత్రి బాబు మోహన్ అన్నారు. సోమవారం ములుగు రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ ఎంపీగా పోటీ చేసిన సమయంలో ప్రస్తుతం ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో తాను ప్రచారం నిర్వహించినట్లు గుర్తు చేశారు. బీజేపీ నుంచి తనకు వరంగల్ ఎంపీ స్థానానికి అవకాశం ఇస్తే పార్టీలో చేరుతానని చెప్పానని, కాని ఆ పార్టీ తన సేవలు వినియోగించుకుని మోసం చేసిందన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నానని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తాను చిల్లర రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తి కాదన్నారు. వైజాగ్‌లో కేఏ పాల్‌తో ప్రచారం చేస్తున్న క్రమంలో మీడియా నుంచి చాలా ఫోన్ కాల్స్ వచ్చాయని, తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన తప్పుడు వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ఒక్క రోజు కూడా అబద్ధం చెప్పలేదని పేర్కొన్నారు. కేఏ పాల్ కూడా వైట్ పేపర్ లాంటి వ్యక్తి అన్నారు. వరంగల్‌లో ఎన్నో సభలో పెట్టారని, ప్రపంచ బాక్సర్‌ను వరంగల్‌కు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. వరంగల్ బిడ్డగా తనను గెలిపిస్తే వితంతు, వృద్ధులకు కేఏ పాల్ సొంత డబ్బులతో పెన్షన్‌లు ఇప్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందేలా చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

వ్యాపారులకు సహకారం అందించాలి

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి

వరంగల్: మిర్చి దిగుబడులు ఎక్కువ మొత్తంలో మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే కోల్డ్ స్టోరేజీలు నిండుకున్నందున రైతులు వ్యాపారులకు సహకారం అందించాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. వరంగల్ మార్కెట్‌కు 2, 3 ఏళ్ల నుంచి రాష్ట్రం నలుమూల నుంచి మిర్చి పంట అధికంగా వస్తోందన్నారు. కొనుగోలు చేసిన మిర్చికి ఏరోజుకు ఆరోజు నగదు చెల్లించడంతో గత ఏడాది కంటే ఎక్కువ సరుకు మన మార్కెట్‌కు వస్తోందన్నారు. జిల్లాతో పాటు కాగజ్‌నగర్, ఆదిలాబాద్, మంచిర్యాల, చెన్నూరు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నల్గొండ జిల్లాల నుంచి ఎక్కువ మొత్తంలో వస్తుందన్నారు. పక్కరాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర, కర్ణాటక నుంచి కూడా సరుకు రావడంతో కోల్డ్ స్టోరేజీలు అన్ని రైతులు, వ్యాపారస్తుల సరుకులతో పూర్తి స్థాయిలో నిండిపోయాయన్నారు. దేశీయ మార్కెట్లో ఇతర రాష్ట్రాల్లో కూడా పంట దిగుబడులు ఎక్కువగా ఉంది. ఇక్కడ కొనుగోలు చేసిన సరుకులను ఎగుమతి చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆశాజనకంగా లేని కారణంగా, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, థాయ్ లాండ్, మలేషియా తదితర దేశాలకు ఎగుమతులు ప్రోత్సాహకరం లేని కారణంగా కొనుగోలు చేసిన సరుకులను స్టోరేజీల్లో పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మార్కెట్‌లో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ఏప్రిల్ నుంచి మిర్చి సరుకు తీసుకొచ్చే ముందు రోజురోజుకు మారుతున్న ధరలను, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, సరుకు నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ఇంటి వద్దనే ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిల్వ చేసుకోవాలన్నారు.